

ఎన్నికల నియమావళిని అమలు చేయండి

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని, సివిజిల్ లో అందినఫిర్యాదుల పరిష్కార చర్యలు, పత్రికల, చానళ్ళలో వచ్చిన ప్రతికూల వార్తలపై సకాలంలో స్పందించి తగు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా స్పష్టం చేసారు. బుధవారం విజయవాడ ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి పాడేరు జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు, వివిధ నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్సులో నిర్వహించిన సమీక్షలో సిఇఒ మాట్లాడారు. పలు అనుమతులకు 48 గంటల ముందుగా సువిధ యాప్ లేదా వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిని పరిశీలించి 24 గంటలలో అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు ఎన్నికల అధికారుల సందేహాలను నివృతి చేసారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, పాడేరు రిటర్నింగ్ అధికారి, జేసి భావన వశిస్ట్, అరకు రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, డిఆర్ఒ బి.పద్మావతి, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.అంబేద్కర్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణకు ముందస్తు చర్యలు

-జోనల్ మలేరియా అధికారి శాంతి ప్రభ

ప్రజాశక్తి-పాడేరు: మన్యంలో మలేరియా నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతి ప్రభ సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లో బుధవారం ఆమె సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఇందులో భాగంగా ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రక్త పరీక్షల లేబరేటరీలో రికార్డ్ లను పరిశీలించారు. మలేరియా పాజిటివ్ కేసులు నమోదైన కందులపాలెం, చింతాడ, వంట్లమామిడి గ్రామాలలోని కేసులను ఆమె పరిశీలించారు. అదే విధంగా వంట్లమామిడి హెల్త్ వెల్ నెస్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేశారు. ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వంట్లమామిడి సచివాలయం ఆరోగ్య సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దృష్టికి తీసు కెళ్లారు. మలేరియా రికార్డులు, ల్యాబ్ రిపోర్ట్స్, రక్త నమూనాల స్లైడ్స్ పరిశీలించారు. అనంతరం జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ భాషను కలిసి తనిఖీలో పరిశీలించిన విషయాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మలేరియా నియంత్రణపై గ్రామాల్లో ప్రజల్ని చైతన్యం చేసేందుకు చేపట్టవలసిన ముందస్తు కార్యక్రమాలను తెలియజేశారు. జిల్లాలో ఎల్‌టిలకు హెల్త్ అసిస్టెంట్లకు ట్రైనింగ్, ప్రజలకు అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరసింహారావు, ఎంపిహెచ్ఈఓలు బి.తిరుపతిరావు, బి.ధనుంజయ్‌రావు, ఏపీఎంవో డి.శేషాద్రి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న శాంతిప్రభ

ఎన్నికలు సజావుగా జరిగేందుకు చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేసారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను అరకు, పాడేరు రిటర్నింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎటువంటి అపోహలకు తావు లేకుండా అన్ని భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటింగ్ ముందు రోజు ఎన్నికల సామగ్రి పంపిణీ చేయాల్సిన విధానం, కౌంటింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు తెలియజేశారు. ఈ పరిశీలనలో పాడేరు రిటర్నింగ్ అధికారి, జేసి భావన వశిస్ట్, అరకు రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.అంబేద్కర్, గిరిజన సంక్షేమ ఇఇ డివిఆర్ఎం రాజు, సర్వే అండ్ లాండ్స్ అధికారులు, స్థానిక తహసిల్దార్ కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

కలెక్టర్ విజయ సునీత



పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

కూటమి టిడిపి అభ్యర్థి మార్పు

- దొన్ను దొరకు షాక్

-పాంగి రాజారావుకు సీటు ఖరారు

ప్రజాశక్తి- అరకు లోయ: బిజెపి టిడిపి జనసేన అరకు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థిగా బిజెపి అభ్యర్థి పాంగి రాజారావును అధిష్టానం ఎంపిక చేసింది. సుమారుగా నెలరోజుల క్రితం టిడిపి అభ్యర్థి సియ్యారి దొన్ను దొర ను అరకు అసెంబ్లీ అభ్యర్థిగా ఇటీవల అరకు సందర్శించిన తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఇక్కడి బహిరంగ సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. పొత్తులో భాగంగా అరకు అసెంబ్లీ సీటును మార్పు చేసి బిజెపి అభ్యర్థి పాంగి రాజారావును బుధవారం అధిష్టానం ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా అరకులోయ కూటమిలో గందరగోళం మొదలైంది.



ఉపాధ్యాయ వృత్తిని రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేసిన సియారి దొన్నుదొర 2014లో వైసిపి టికెట్ ను ఆశించి భంగపడ్డాడు. దీంతో తన వర్గీయులు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాల్సిందిగా కోరడంతో ఆ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. తర్వాత టిడిపి గూటికి చేరిన దొన్నుదొర అరకు నియోజకవర్గంలో పర్యటించి తనదైన ముద్ర వేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు తెలుగుదేశం అసెంబ్లీ అభ్యర్థిగా కూటమి నుంచి బహిరంగ సభలో దొన్ను దొర ను ప్రకటించారు. అప్పటినుంచి ఆయన అవిశ్రాంతంగా గ్రామాల్లో తిరిగి ప్రచారం ముమ్మరంగా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నుంచి అరకు టికెట్ మార్పు చేసి బిజెపి నేత పాంగిరాజు రావు కేటాయించడంతో దొన్నుదొర వర్గీయులు షాకయ్యారు. తెలుగుదేశం పార్టీలో ముందుగా టికెట్ ఖరారు చేసి తర్వాత మార్పు చేయడం అధినేత చంద్రబాబు నాయుడుకి ఇది కొత్త ఏమి కాదు. 2014 ఎన్నికల్లో ప్రస్తుత గవర్నర్ కోట ఎమ్మెల్సీ కుంభ రవిబాబు కు టికెట్ ఖరారు చేసి నామినేషన్ వేసిన తర్వాత రవిబాబు బీఫామ్ ను రద్దుచేసి చివరి నిమిషంలో సివేరి సోమకు టికెట్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ దొన్నుదొర విషయంలో పునరావృతం అవుతుండడంతో తెలుగుదేశం పార్టీ అనుసరిస్తోన్న విధానం పట్ల నాయకులు, కార్యకర్తల్లో విశ్వాసం కోల్పోతున్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య

గ్రామీణ రోడ్లకు నిధులు కేటాయించాలి

- సిపిఎం నేతలు సీతారామయ్య, కొమరం పెంటయ్య

ప్రజాశక్తి-కూనవరం

గామీణ రోడ్ల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. మండలంలోని అభిచర్ల గ్రామంలో మాజీ సర్పంచ్ రవ్వ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సిపిఎం జనరల్ బారీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంగాని గ్రామీణ రోడ్లకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని తెలిపారు. ఇలా అయితే గ్రామాల అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రతి గ్రామానికీ సీసీ రోడ్లు, తారు రోడ్లుకు ప్రభుత్వాలు నిధులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి కూర రవి శంకర్, పులి చరిత తదితరులు పాల్గొన్నారు.



గిరిజన రైతులకు టార్పాలిన్లు అందిస్తున్న ఎఎస్పి శివ కిశోర్

గ్రామాల్లో డిఎం అండ్ హెచ్ఒ పర్యటన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మారుమూల ప్రాంతమైన ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న మర్రిపాలెం, సోడా గ్రామాల్లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి జమాల్ భాష బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. మారుమూల గ్రామాల్లో ప్రజలకు ఈ సీజన్లో డయేరియా, మలేరియా వంటి వ్యాధుల ప్రబలకుండా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. గిరిజనులు సేవిస్తున్న తాగునీటిని సేకరించి పరీక్షల నిమిత్తం పంపించినట్లు ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో తగు చర్యలు చేపడుతున్నామని వైద్య ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాఫీ తోట దగ్ధం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయితీ గుమ్మగుడలో గుర్తు తెలియని దుండగులు కాఫీ తోటకు మంగళవారం రాత్రి నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన పాంగి సుందర్రావు ఎకరా కాఫీతోటతో పాటు మిరియాలు, సిల్వర్ ఓక్, పండ్ల మొక్కలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రతి ఏడాది ఆదాయం వచ్చే కాఫీ తోటను గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడంతో రోడ్డున పడాల్సి వచ్చిందని బాధిత గిరిజనుడు వాపోయారు. ప్రభుత్వం స్పందించి అధిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత కాఫీ రైతు కోరాడు.



దగ్ధమైన తోట

గిరిజనుల వ్యవసాయాభివృద్ధికి పోలీసు సహకారం

ఎఎస్‌పి శివ కిశోర్

ప్రజాశక్తి -సీలేరు

ఏజెన్సీలోని గిరిజన రైతుల వ్యవసాయ అభివృద్ధి పోలీసుశాఖ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు చింతపల్లి సబ్ డివిజనల్ అడిషనల్ ఎస్‌పి శివ కిషోర్ అన్నారు. జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధి సాగుల గ్రామాలో గిరిజన రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో ఆర్గానిక్ వ్యవసాయం చేయడానికి వ్యవసాయ శాస్త్రవేత్త శైలజ, ఎఎస్‌పి శివ కిషోర్ బుధవారం వ్యవసాయ భూముల్లో పర్యటించి మట్టి నమూనాలు సేకరించారు. అనంతరం సాగులు గ్రామంలో రైతుల అభ్యర్థన మేరకు 12 మంది రైతులకు 200 కేజీల అల్లం, మరో పది మంది రైతులకు టార్పాలిన్‌లు, మామిడి పండ్లు కాపాడుకోవడానికి 5000 కవర్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ గిరిజన రైతులు వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్త శైలజ వరి, పసుపు, కాఫీ పంటల్లో ఆధునిక పద్ధతుల పాటించి ఎలా ఎక్కువ దిగుబడులు సాధించాలో అవగాహన కల్పించారు. వ్యవసాయ పనిముట్లు యొక్క ఉపయోగాలను వ్యవసాయ నిపుణులు గిరి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సిఐ కె.రమేష్, జీకే వీధి ఎస్సై అప్పలసూరి, వ్యవసాయ రంగ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.



పథకాలపై ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ తోటవలస గ్రామంలో సర్పంచ్ పి.కొములు ఆదేశాల మేరకు టిడిపి బూత్ ఇన్చార్జీలు, వార్డు సభ్యులు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలోని గిరిజనులకు టిడిపి మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జీలు కే నాగరాజు, మోహన్ దాస్, పి.ఒలేక్, వార్డు సభ్యులు దొంబు నాయుడు, టిడిపి నాయకులు కె రాంబాబు గిరిజనులు పాల్గొన్నారు.



జిప్‌లైన్‌ను పరిశీలిస్తున్న తిరునాథరావు

జిప్‌లైన్ ఏర్పాటుపై ఆరా

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా గిరిజనేత్రుడు జిప్‌లైన్‌ను నిర్మించారనే ఫిర్యాదు మేరకు లీగల్ అడ్వైజర్ ట్రైబల్ వెల్ఫేర్ కమిషన్ పి.తిరునాథరావు పరిశీలించారు. బుధవారం సందర్శించిన ఆయన ఈ జిప్‌లైన్ నిర్మాణంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో హక్కులు, చట్టాలకు అనుగుణంగా గిరిజనేతరులు ఆక్రమణలకు పాల్పడటం చట్ట విరుద్ధమన్నారు. దీనిపై ఎస్టి కమిషన్ నుండి తమకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందిందని తెలిపారు. బొర్రా లో పనిచేస్తున్న కార్మికులు పలు సమస్యలపై విన్నవించారు. కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, 2018లో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం హామీలు పరిష్కారం చేయలేదని విన్నవించారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్. నాగజ్యోతి, ఇన్‌చార్జి ఎంపీడీవో నగేష్, ఆర్ఐ శంకర్రావు, కె.సొమ్మర, సోమేష్, వి. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ దోమల నివారణ మందు పిచికారీ

- పూర్తిస్థాయిలో మలేరియాను నిర్మూలించేందుకు చర్యలు

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ఏడు మండలాల్లో మలేరియాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంటికీ దోమల నివారణ మందు (మలాథియన్) పిచికారీ చేయించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలోని తన ఛాంబర్‌తో పిఒ సూరజ్ గనోరే బుధవారం ఎడిఎంహెచ్ఓ, మలేరియా శాఖ అధికారులు, సబ్ యూనిట్ అధికారులు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో నేరుగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మలేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని మలేరియా వ్యాధి నిర్మూలించేందుకు ఈ నెల 15వ తేదీ నుండి మలాథియన్ స్ప్రేయింగ్ ప్రారంభమైందని తెలిపారు. ఏజెన్సీలోని ప్రతి ఇంటిలో మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్ చేయించి మలేరియా దోమలు ఉత్పత్తి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరికైనా మలేరియా లక్షణాలు ఉంటే వెంటనే రక్త పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ అయితే సంబంధిత మందులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. రక్త నమూనాలకు సంబంధించిన కిట్లు, మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ ఏడాది జనవరి నెల నుండి ఎన్ని మలేరియా కేసులు నమోదయ్యాయో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏయే గ్రామాల్లో మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్ చేసింది ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్ చేయించినప్పుడు సంబంధిత పిహెచ్‌సి వైద్యాధికారులతో సర్టిఫికెట్లు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎడిఎంహెచ్ఓ జి.ప్రకాశం, మలేరియా ఏఎంఒ నక్క వెంకటేశ్వరరావు, రామకృష్ణ, యస్ఓ టి.మార్తమ్మ, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న విఆర్.పురం తహశీల్దారు మౌలానా ఫాజిల్

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-విఆర్.పురం

ఈ నెల 18న ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాలను తహశీల్దారు మౌలానా ఫాజిల్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు విజయవంతంగా నిర్వహించిన విద్యశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సహకరించిన ఆరోగ్య, పోలీసుశాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లోనూ విద్యార్థులకు అవసరమైన మంచినీరు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయడం బాగుందని పేర్కొన్నారు.

డుంబ్రిగుడ : మండల కేంద్రంలో పది పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలలు, మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పది పరీక్షలో మాస్ కాఫీయింగ్ కు తావు లేకుండా పగడ్బందిగా నిర్వహించారు. పోలీసు బందోబస్తు నడుమ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

పెదబయలు : పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన గురుకులం, ప్రభుత్వ బాలికల పాఠశాలలో 609 మంది కి గాను జిల్లా పరిషత్ పాఠశాలలో ఒకరు గైర్హాజరయ్యారు. మండల విద్యాశాఖాధికారిణి గుమ్మా పుష్పవతి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

తాగునీటి బోరుచుట్టూ అపారిశుధ్యం

పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని విఆర్.పురం రాజీవ్ గాంధీ సెంటర్లో ఉన్న తాగునీటి బోరు చుట్టూ పారిశుధ్యం తాండవిస్తోంది. బోరు ఆవరణలోనూ, దాని చుట్టూ పెద్ద ఎత్తున చెత్తాచెదారం ఉండడంతో కనీసం బాటసారులు మంచినీళ్లు తాగడానికి కూడా వీల్లేని దుస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు చుట్టూ అపారిశుధ్యం ఉండటంతో స్థానికులు బోరు నీరు తాగలేక నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సురక్షిత మంచినీరు అందించే బోరు చుట్టూ చెత్త పేరుకుపోయినా పంచాయతీ అధికారులు తొలగించే ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు ఆవరణలోనూ, చుట్టూ ఉన్న అపారిశుధ్యాన్ని తొలగించాలని, అక్కడ చెత్తా చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తాగునీటి బోరు చుట్టూ పెద్ద మొత్తంలో ఉన్న చెత్తా చెదారం

అప్పారి స్ఫూర్తితో ఉపాధ్యాయులు ఉద్యమించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) వ్యవస్థాపక నాయకులు అప్పారి వెంకటస్వామి స్ఫూర్తితో ఉపాధ్యాయులు తమ సమస్యలపై ఉద్యమించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సోడే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. విఆర్ పురంలో బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో అప్పారి వెంకటస్వామి వర్ధంతి సభ నిర్వహించారు ముందుగా అప్పారి చిత్ర పటానికి ఉపాధ్యాయ నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి ఎంతో అంకిత భావంతో పనిచేశారని తెలిపారు. తమ సమస్యలు కోసం ఉపాధ్యాయు బయట కొచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎన్ జగదీష్, మండల కార్యదర్శులు ఓ మంగరావు రెడ్డి, యస్ అజయ్, యన్ ప్రసాద్, కె రమేష్ బాబు, పి గురుసాయి నవీన్, యం బాబు, ఎన్ రామకృష్ణ పాల్గొన్నారు.



అప్పారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

వరి సాగులో విత్తన మార్పిడిపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వరి సాగులో విత్తన మార్పిడి పై రైతులకు అవగాహన కల్పించి ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు సూచించారు. మండలంలోని ఉద్దండపురం రైతు భరోసా కేంద్రంలో బుధవారం పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలో 5 మండలాలకు సంబంధించి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలో సుమారుగా 37500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారన్నారు. రైతాంగం ఆనాటి నుండి నేటి వరకు పాత రకాలైన వరి విత్తనాలను మాత్రమే సాగు చేస్తున్నారని, రైతులకు కొత్త రకాలైన విత్తనాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆర్ జి ఎల్ 2537 బదులుగా ఎంటియు 1262 మార్టూరు సాంబ, ఎంటియు 1061 ఇంద్ర, ఎంటియు 1064 అమర రకాలను, బిపి టి 5204 సాంబ మసురికి బదులుగా మార్టెరు సాంబ కొత్త రకాలను రైతులు వరి సాగు చేయడంతో తెగుళ్ళ, చీడలను తట్టుకోవడంతో పాటు ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. రైతులు కొత్త రకాలను వాడే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కొత్త రకాలతో కలుగు లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎరువుల యాజమాన్యంలో నానో యూరియా, నానో డి ఏపిలను పంటల సిఫార్సు బట్టి రైతులు వాడేలా ప్రోత్సహించాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు సూక్ష్మ ప్రణాళికతో సన్నద్ధతగా వుండాలన్నారు. ఈ సమావేశంలో ఎలమంచిలి వ్యవసాయ సహాయ సంచాలకులు రవి ప్రకాష్, వ్యవసాయ అధికారులు సౌజన్య, ఉమా ప్రసాద్, ఆదినారాయణ, మోహన్, ఏ ఈఓలు సత్యనారాయణ, నాయుడు, బాబాజీ, ఎంపిఈ ఓలు గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఉపమాకలో ఘనంగా పందిరి రాటోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరకవీధి రామాలయం వద్ద బుధవారం ఉదయం గ్రామ పెద్దలు చేతుల మీదుగా ఏప్రిల్ 17వ తేదీన శ్రీరామనవమి వేడుక సందర్భంగా రాములోరి పందిరి పందిరి రాటోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా సప్తాహం కార్యక్రమం నిర్వహించనట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఏప్రిల్ 10వ తేదీ ఉదయం 6 గంటల నుండి 17వ తేదీ ఉదయం 6 గంటల వరకు గ్రామ ప్రజల సహకారంతో, శ్రీనివాస భజన భక్త సమాజం ఆధ్వర్యంలో సప్తాహం (7 రోజులపాటు భజన కార్యక్రమం) నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.ఏప్రిల్ 17న సీతారాముల కళ్యాణ మహోత్సవం ను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి కొండబాబు , కృష్ణ, సిహెచ్ వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి బుజ్జి, హరిబాబు, ప్రగడ వీరబాబు, ఈశ్వరరావు, హరి, రవి, టి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే రాళ్లు దుర్వినియోగం

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ సర్వే నిమిత్తం ఏర్పాటు చేసిన సర్వే రాళ్ళ దుర్వినియోగం అవుతున్నాయి. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు, మండల కేంద్రంలో సర్వే రాళ్ళ ప్లాంటేషన్ నిమిత్తం మండల పరిషత్ ఆవరణలో ఉంచారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో స్టోన్ ప్లాంటేషన్ పనులు నిలిచిపోయాయి. ఈ సర్వే రాళ్లను వివిధ రకాలుగా దుర్వినియోగం చేయడం విశేషం. ఒక్కో సర్వే రాయి దాదాపు 500 రూపాయలు ఉంటుంది. ఈ రాళ్ళను వివిధ రకాలుగా వినియోగించు కుంటున్నారు. ఇటీవల మండల పరిషత్ ఆవరణలో చేపట్టిన సిమెంటు పలకల ఏర్పాటుకు, రోడ్డు నిర్మాణానికి ఈ రాళ్లను ఏర్పాటు చేయడం గమనార్హం. అదేవిధంగా పౌరసరఫరాల గిడ్డంగి వద్ద మెట్టు నిర్మాణానికి ఈ సర్వే రాళ్లను వినియోగించడం విశేషం. ఇక్కడ ఏర్పాటు చేసిన రాళ్లపై ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ రాళ్లపైన పేర్లను తొలగించలేదు.అధికారులు ఇప్పటికైనా స్పందించి విలువైన సర్వే రాళ్లను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ బుధవారం పర్యవేక్షించారు. బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదనపు ఎస్పీ వెంట నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి ఉన్నారు.

సిపిఎం పోరాటంతోనే సమస్యల పరిష్కారం

పార్టీ అభ్యర్థులను గెలిపించాలి
గ్రామాల్లో నేతలు ముమ్మర ప్రచారం



మాట్లాడుతున్న గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించి చట్టసభల్లో పంపించాలని ఆ పార్టీ నేతలు కోరారు. మండలంలోని మారుమూల కివర్ల, పినకోట పంచాయతీ బొంగిజ గంగవరం, పూతికపుట్టు, జగడలమామిడి, జోసురు, చీడిమెట్టు, గడ్డిబంద గ్రామాల్లో సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు, నాయకులు పర్యటించారు. సిపిఎం బృందానికి ఆదివాసీ మహిళలు పూలదండలు వేసి స్వాగతం పలికారు. అనంతరం గిరిజన సమస్యలు తెలుసుకున్నారు. గిరిజనులు సిపిఎం నేతలతో మాట్లాడుతూ, సిసి రోడ్లు, తాగునీటి, పోడు పట్టాలు ఇతర సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే జీఓ 3 చట్టబద్ధతపై పోరాటం చేస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లో సిపిఎం పోరాటం వల్లే రోడ్లు, తాగునీటి వంటి సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చొంపి సింహాద్రి, పాంగి మోహన్, గిరిజన సంఘం నాయకులు నరాజ్, సురేష్‌బాబు, సూకురు గంగన్న, పుట్టబోయిన దేముడు, కుముడుబోయిన దేముడు, చందర్‌రావు, పి.బి బాబూరావు, పొట్టంగి సత్యారావు, మాదాల.కొండబాబు గిరిజనులు పాల్గొన్నారు.

అరకులోయ: సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం బలపరిచిన అరకు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీ గెలిపించి చట్టసభలో పంపించాలని పద్మాపురం మండల కార్యదర్శి కె రామారావు, ఉప సర్పంచ్ జె.భగత్‌రామ్ కోరారు. బుధవారం మండలంలోని పద్మాపురం పంచాయతీ దుమ్మగూడకాలనీ గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు, జె.భగత్రాం పర్యటించి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, పద్మాపురం పంచాయతీలో మినీ రిజర్వాయర్ నిర్మాణం చేయాలని, తాగునీరు, సిసి రోడ్డు, డ్రైనేజీ వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, పద్మాపురం పంచాయతీ ఉపసర్పంచ్ జన్ని భగత్ రామ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపించాలని కోరారు. బిజెపి ప్రభుత్వం గిరిజన హక్కులు చట్టాలకు తూట్లు పొడుస్తున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే పార్టీతో టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు ఏమిటని ప్రశ్నించారు. వైసిపి జీవో 3 చట్టబద్ధత కోసం కనీసం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు బలరాం, ధశరథ్, జయో, మధు, ధనరాజ్, బాలు, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



దుమ్మగూడ కాలనీలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తాం

తాడి గ్రామస్తులు

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి మండలంలోని తాడి గ్రామాన్ని తరలించాలని లేనిపక్షంలో గ్రామస్తులంతా రానున్న సార్వత్రిక ఎన్నికల బహిష్కరిస్తున్నట్లు బుధవారం తాడి గ్రామంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి గ్రామస్తులంతా ముక్తకంఠంతో వెల్లడించారు. తాడి గ్రామం ఫార్మాసిటీ కోరలలో చిక్కుకొని అల్లాడుతోందని, 17 ఏళ్ల నుంచి మూడు ప్రభుత్వాలు కాంగ్రెస్, తెలుగుదేశం, వైసిపి మారినా తాడి గ్రామాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మా సిటీ నిర్మాణానికి ముందే గ్రామాన్ని తరలిస్తామని, అధికారులు మినిట్ పెట్టి గ్రామాన్ని తరలిస్తున్నారని చెప్పి ల్యాండ్ ఫీల్డ్ పర్మిషన్ ఇవ్వాలని అడిగారని వివరించారు. గ్రామాన్ని తరలించడానికి రాంకీ చైర్మన్ అయోధ్య రామిరెడ్డి రూ.56 కోట్లు రిలీజ్ చేస్తున్నట్లు చెక్కును కూడా రాసి గ్రామస్తులకు చూపించారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు గ్రామం తరలించలేదన్నారు. ఇప్పుడు మాట మార్చి ప్రభుత్వం గ్రామాన్ని తరలించాలని, తామెందుకు మీ గ్రామాన్ని తరలించాలని రాంకీ యాజమాన్యం తప్పించుకు తిరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్కొక్కసారి అర్ధరాత్రి సమయంలో ఫార్మా కంపెనీలు తగలబడిపోతే చంటి పిల్లలను చంకలో పెట్టుకొని పరుగులు తీసిన రోజులు ఎన్నో ఉన్నాయని తెలిపారు. తరలింపునకు తెలుగుదేశం ప్రభుత్వం జిఒ తీసుకొచ్చిందని,ఈ లోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని, తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మరో జిఒ తెచ్చి రెండు నెలల్లో గ్రామాన్ని తరలిస్తామని సబ్బవరం మండలంలో జగనన్న కాలనీ శంకుస్థాపనకు వచ్చిన సందర్భంలో ప్రకటించినా నేటికీ తరలింపునకు నోచుకోలేదన్నారు. ఇప్పుడు రాంకీ వారు గ్రామాన్ని ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్, బఫర్ జోన్ ఏరియాలో పైపులను వేస్తున్నారని, దీనిపై గ్రామస్తులంతా అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు జరుపుతున్నామని తెలిపారు. గతంలో గ్రామాన్ని ఆనుకొని 50 ఎకరాలు ల్యాండ్‌ఫిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చిందని, దీనిపై పరవాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయసేకరణ ఏర్పాటు చేస్తే గ్రామస్తులంతా ఏకతాటిపై బహిష్కరించామని గుర్తుచేశారు. ఇన్ని చేసినా గ్రామాన్ని తరలించేందుకు ఎవరు స్పందించకపోవడంతో రానున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తున్నామని చెప్పారు. గ్రామ తరలింపునకు జిల్లా కలెక్టర్ పూర్తి హామీ ఇస్తే ఎన్నికల్లో పాల్గొంటామని, లేని పక్షంలో పార్టీలకతీతంగా ఏకతాటిపై ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు డిమాండ్‌పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి మాధంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బోండపల్లి అప్పారావు, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ దళాయి నదియా, కోమటి అచ్చిబాబు, కోమటి సూరిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోమటి కులదీప్ రాజ్, జిత్తుల మాధవరావు, గొల్లవిల్లి అచ్చిబాబు, గనిరెడ్డి కనకారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం'

ప్రజాశక్తి -నక్కపల్లి:జనసేన పార్టీని వీడిని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ హితవుపలికారు. నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శేషుకుమారి, సరోజ, లక్ష్మి శివకుమారి జనసేన పార్టీని వీడి ఖైదీలపార్టీలో చేరి శ్రీరంగ నీతులు చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ,పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌లపై ఏది పడితే అది ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పార్టీ కార్యదర్శి ఆకేటి గోవిందరావు, నాయకులు పాము గణేష్, చంద్రరావు, జోగారావు, జువ్విన బద్రి, మెరుగు మహేష్, గోవిందు, ఆనంద్ కుమార్, సిహెచ్ రాము, చిన్నా, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు .

రాజకీయాలకతీతంగా పథకాలు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సంక్షేమం, అభివృద్ధి కోసం వైసిపిని గెలిపించాలని నర్సీపట్నం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. బుధవారం మండలంలోని అమలాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, గడిచిన ఎన్నికల్లో వైసీపీ ప్రకటించిన మేనిఫెస్టోను నూటికి 99 శాతం అమలు చేశామని చెప్పారు. 2014లో టీడీపీ 600 హామీలు ఇచ్చి కనీసం 60 కూడా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మళ్లీ సంక్షేమం, అభివృద్ధి కోసం వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, అమలాపురం సర్పంచ్ శెట్టి శ్రీను, వేములపూడి ఎంపిటిసి బోళెం వెంకటేష్, గురందొరపాలెం సర్పంచ్ చినబాబు, ధర్మసాగరం సర్పంచ్ కన్నయ్యనాయుడు, ఒఎల్ పురం సర్పంచ్ బంటు నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పెంటర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో బుధవారం కార్పెంటర్స్ డే సందర్భంగా బుధవారం కార్పెంటర్స్ కేక్ కట్ చేశారు. సీనియర్ కార్పెంటర్స్ కి సన్మానం చేసారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్‌లో చిన్న చిన్న రిపేర్ పనులు చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి డాక్టర్లు హరి ప్రవీణ్, గాయత్రి, సావిత్రి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కార్పెంటర్స్ ఎంతో సేవా దృక్పథంతో హాస్పిటల్లో బెంచీలు, తలుపులు రిపేర్ పనులు చేస్తూ రోగులకు పండ్లు పంపిణీ చేయడం చాలా సంతోషమన్నారు.ఈ కార్యక్రమంలో గొలుగొండ మండలంలోని కార్పెంటర్స్ పాల్గొన్నారు.

పలు షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్:అనకాపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అడిషనల్ సూపరిండెంటెంట్ ఆదేశాల మేరకు గొలుగొండ ఎస్ఈబి ఎస్సై రహీం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పాన్, కిరాణా షాపులు, టిఫెన్ హోటళ్లను తనిఖీ చేశారు. సదరు షాపుల్లో ఎటువంటి మద్యం విక్రయాలు, నిల్వలు లేవని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈబి సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నాతవరం మండలం డి.ఎర్రవరం గ్రామంలోని టీడీపీకి చెందిన పలువురు బుధవారం వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ, వైసీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షి క్లియరెన్స్ సేల్ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్‌లోని లేపాక్షి ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్ బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 31వ తేదీతో ఈ సేల్ ముగుస్తుందని లేపాక్షి విశాఖ నగర బ్రాంచి మేనేజర్ ఎ.కార్తీక్ తెలిపారు. తయారుచేసిన హస్త కళా వస్తువులను ఈ ఎగ్జిబిషన్‌లో తయారీదారులే నేరుగా విక్రయిస్తారన్నారు.

ఉత్తరాంధ్రులను అవహేళన చేస్తే సహించం

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తరాంధ్ర ప్రజలను అవహేళన చేస్తే సహించేది లేదని వైసిపి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు స్పష్టం చేశారు. బుధవారం జివిఎంసి 50వ వార్డు మాధవధార వద్ద స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు మతిభ్రమించినట్లు మహిళలు, వైసిపి నేతలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికలో విష్ణుకుమార్‌రాజు చిత్తుగా ఓడించి, వైసిపి విజయకేతనం ఎగరేస్తామన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌ను సాదర స్వాగతం పలకడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్ల రజిని ఈశ్వరరావు, కార్పొరేటర్లు కె. అనిల్‌కుమార్ రాజు, సారిపిల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్‌ఆలీ, కెవిఎన్ శశికళ, .జెసిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భగవతి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కెకె.రాజుకు పలుసంఘాల మద్దతు

ఉత్తర నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కెకె.రాజుకు పలు సామాజిక, ప్రజాసంఘాలు మద్దతుగా నిలుస్తున్నారు. బుధవారం పార్టీ కార్యాలయానికి వచ్చిన పలు సంఘాల నేతలు సంపూర్ణ మద్దతు తెలిపి, రాజు విజయానికి కృషి చేస్తామని భరోసానిచ్చారు.

అనుబంధ సంఘాల నేతలు కృతజ్ఞతలు

ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు సూచనతో ఇటీవల పలు వార్డుల్లో నియమితులైన పార్టీ అనుబంధ సంఘాల నేతలు బుధవారం కెకె.రాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి తాము సైనికుల్లా పనిచేసి, రాజు గెలుపునకు కృషి చేస్తామన్నారు.

స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ బడ్జెట్‌కు మహాజన సభ ఆమోదం



త్రిఫ్ట్ సొసైటీ మహాజనసభలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు ఆనంద్ కుమార్

ప్రజశక్తి-ఉక్కునగరం :విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ 59వ మహాజనసభ బుధవారం స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో జరిగింది. సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మహాసభలో ముందుగా మరణించిన సభ్యులకు ఎంవి.రమణ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం కార్యక్రమంలో కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి నివేదికను మహాజన సభలో ప్రవేశపెట్టారు. 2024-25 బడ్జెట్‌ను డివిఎస్ఎన్ కొండరాజుప్రవేశపెట్టగా, మహా జనసభ ఆమోదించింది. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 37ఏళ్లుగా ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా, సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తూ సంఘం ప్రగతి పథంలో సాగుతోందన్నారు. 12,933 మంది సభ్యులతో రూ. 361 కోట్ల టర్నోవర్‌తో పనిచేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం ఆడి వర్గీకరణలో ఏ గ్రేడ్ సొసైటీగా నిలిచిందన్నారు.డైరెక్టర్ కర్రి శ్రీనివాస్. మహీధర్ వివిధ కార్మిక సంఘాల నాయకులు, పాలకవర్గ మాజీ సభ్యులు, సీనియర్ మేనేజర్ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్‌సి సెల్ ప్రధానకార్యదర్శిగా రాజబాబు

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక నియోజకవర్గం పెదగంట్యాడకు చెందిన ములకలపల్లి రాజుబాబును విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ చైర్మన్ పెద్దాడ గణ నాగఫణి బుధవారం ఉత్తర్వులు జారీ చేయగా, వాటిని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అందజేశారు కార్యక్రమంలో ఎపిసిసి జనరల్ సెక్రెటరీ గాదం మహేష్, 64వ వార్డు అధ్యక్షులు యరబాల భూలోక పాల్గొన్నారు.

మనుషుల్లో మానవతా దృక్పథం నెలకొల్పాలి

- ఎయులో ధార్మిక విజ్ఞాన పరిణామంపై జాతీయ సదస్సులో ఆచార్య రెమిరజని



మాట్లాడుతున్న శ్రీకాకుళం అంబేద్కర్ వర్సిటీ విసి రెమిరజని

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మానవ సమాజంలో మత విశ్వాసాలకంటే మానవతా దృక్పథం నెలకొల్పాలిన ఆవశ్యకత ఎంతైనా ఉందని శ్రీకాకుళం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కాళంగి రెమిరజిని అన్నారు. బుధవారం ఎయులో ఫిలాసఫీ అండ్ రెలిజియస్ స్టడీస్ విభాగం, ఎసిటిఎస్ సంయుక్త నిర్వహణలో "ధార్మిక విజ్ఞాన పరిణామం: ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథాలు' అంశంపై జాతీయసదస్సు నిర్వహించారు ఫిలాసఫీ శాఖాధిపతి ఆచార్య వానపల్లి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో కీలకోపన్యాసం చేసిన ఆచార్య రెమిరజని మాట్లాడుతూ, మనిషి మనిషి మధ్య మతం అడ్డుగోడగా ఉందన్నారు. ప్రవర్తనను సరైన మార్గంలోకి నడిపించాల్సిన మతసారాన్ని తెలుసుకోకుండా, మనిషి స్వార్థంతో మతఘర్షణలకు పాల్పడుతూ సమాజాన్ని మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడని, దీనిని అందరూ ముక్తి కంఠంతో ఖండించాలన్నారు.

.ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ తల్లిదండ్రులను గురువులను పెద్దలను గౌరవించే సంప్రదాయాలు అంతరించి పోతున్నాయని ఆవేదన చెందారు. బెంగుళూర్ ఏసిటియస్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ సిఇఒ సంతోష్ నకణ్ మాట్లాడుతూ, ఎయుతో ఎసిటిఎస్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవటం ఆనందంగా ఉందని, దీని ద్వారా విద్యార్థులలో పరిశోధనా సామర్థ్యం పెంపొందుతుందన్నారు.ఎయు రిజిస్ట్రార్ ఆచార్య యం జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలు విస్తృతమై, ప్రపంచమే కుగ్రామంగా మారిన నేటి పరిస్థితుల్లో మానవతా విలువలు లోపించడం బాధాకరమన్నారు. ధార్మిక జీవన విధానం తో మనుస్యుల మధ్య పెరుగుతున్న అంతరాన్ని తొలగించుకునే అవకాశం ఉందన్నారు.

కార్యక్రమంలో బోర్డు అఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ బూసి వెంకటస్వామి, ఉత్కల్ యూనివర్సిటీ ఆచార్య నందిని మిశ్రా, విక్రమ్ దేవ్ యూనివర్సిటీ జైపూర్ ఆచార్య లక్ష్మణ్ పాత్రో, రమాదేవి, కటక్ మహిళా యూనివర్సిటీ నుంచి కళ్యాణి సారంగి, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి ఆచార్య పి రామకృష్ణ చౌదరి, విజయనగరం మహారాజ కళాశాల తత్త్వశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి మాధవరావు ,చరిత్ర విభాగాధిపతి జె వి రమణ, డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ ద్రాక్షాయణి, డాక్టర్ కల్యాణి, రాజధమ్మా పాల్గొన్నారు

ఇంటింటి ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-భీమునిపట్నం : ఇంటింటా ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం సాయంత్రం గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులతో పాటు ఇంటింటి ప్రచారానికి అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు దీనికోసం సువిధ యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో నామినేషన్లు, అఫిడవిట్లను దాఖలు చేసేందుకు కూడా ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ టి గోవింద్, ఎన్నికల డిటి భాస్కర రావు, రాజకీయపార్టీల ప్రతినిధులు వైసిపి నుంచి ముత్తంశెట్టి మహేష్, టిడిపి నుంచి డిఎఎన్ రాజు, గంటా నూకరాజు, కాంగ్రెస్ నుంచి పల్లా వెంకటరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భాస్కర రెడ్డి

ఎయును సందర్శించిన ఇన్ఫోసిస్ ప్రతినిధులు



విసి ప్రసాదరెడ్డితో భేటీ అయిన ఇన్ఫోసిస్ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ఇన్ఫోసిస్ విశాఖ కేంద్రం ప్రతినిధులు బుధవారంసందర్శించారు. ఇన్ఫోసిస్ విశాఖపట్నం డెలివరి సెంటర్ హెడ్ ఎన్.సురేష్, ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో సమావేశమై వివిధ అంశాలపై ప్రాథమికంగా చర్చించారు. కార్యక్రమంలో ఎయు ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మూర్తి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎయు తరపున ఇన్ఫోసిస్ హెడ్ ఎన్.సురేష్‌ని సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. అనంతరం ఇన్ఫోసిస్ ప్రతినిధులు ఎయు ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న సంస్థలు, విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

డంపింగ్ యార్డు తరలింపులో నిర్లక్ష్యం!

- ప్రజారోగ్యం పట్టని ప్రభుత్వం, జివిఎంసి యంత్రాంగం
- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు జగ్గునాయుడు, రాము, స్థానికులు

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ 76వ వార్డు రామచంద్రనగర్ ప్రాంతంలో ఉన్న మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతీయులతో కలిసి డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, జివిఎంసి, చెలగాటమాడుతోందని దుయ్యబట్టారు. 76వ వార్డు రామచంద్రనగర్, స్వతంత్ర నగర్, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ, రిక్షాకాలనీ, గాంధీనగర్ తదితర 16 గ్రామాల ప్రజలతో పాటు సర్దార్ నెస్ట్, నోవస్ తదితర అపార్ట్‌మెంట్ల వాసులు ఈ డంపింగ్‌యార్డు వల్ల తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు రకరకాల వ్యాధులకు గురై వైద్యానికి వేలల్లో ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. చెత్తకు సైతం పన్ను వేసి ముక్కుపిండి వసూలు చేస్తున్న ప్రభుత్వం, జివిఎంసి ప్రజారోగ్యశాఖ దుర్గంధం, చెత్తాచెదారంతో అవస్థలు పడుతున్న ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయడమే కాకుండా, ఉన్నవాటిని తరలించాలని డిమాండ్ చేశారు. 76వ వార్డు ప్రజల ఆరోగ్యంపై దాడిచేస్తున్న ప్రభుత్వం, జివిఎంసి యంత్రాంగం ఇప్పటికైనా కళ్లు తెరవాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ 2013 నుంచి నేటివరకు డంపింగ్ యార్డు తరలించాలని ఈప్రాంతీయులు పలు రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలు, అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రజాందోళనలకు నాడు,నేడు, రేపు కూడా సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. గతంలో తెలుగుదేశం తరపున పల్లా శ్రీనివాసరావు, ప్రస్తుతం వైసిపి ఎమ్మెల్యేగా తిప్పల నాగిరెడ్డి పదవులు నిర్వహించినా డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కనీసం చొరవ చూపలేదన్నారు. ప్రజలకు హామీలివ్వడం, గెలిచాక సమస్యను పక్కన పెట్టడం వీరికి పరిపాటిగా మారిందన్నారు. జివిఎంసి యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే ప్రజాఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ నాయకులు డి.రమణ, రాజు, రాముడు స్థానిక సంఘాల నాయకులు రాజారావు, త్రినాధరావు, చిన్నారావు, జనార్ధనరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. మద్ది, పద్మనాభం, రెడ్డిపల్లి, ఆర్‌వి పురం జిల్లా పరిషత్ హైస్కూల్ కేంద్రాలుగా ఈ పరీక్షలు నిర్వహించారు. ఎటువంటి మాస్‌కాఫీయింగ్‌కు ఆస్కారం లేకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయగా, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించార. ఈ ఏడాది మద్దిలో 178మంది, రెడ్డిపల్లిలో 181మంది, పద్మనాభంలో 180 మంది, ఆర్‌వి.పురం హైస్కూల్లో 163 మంది టెన్త్ పరీక్షలు రాశారు.